కొత్త రాజ్యాంగం తెస్తాం!

- లేదా ఉన్న రాజ్యాంగంలో సవరణలు తీసుకొస్తాం
- ఎన్డీయేకి 2/3 మెజారిటీ ఇస్తేనే ఇది సాధ్యం
- అయోధ్య బీజేపీ ఎంపీ లల్లూ సింగ్ కీలక వ్యాఖ్యలు
- రాజ్యాంగంలో మార్పులు జరుగొచ్చన్న అరుణ్ గోవిల్
- గడిచిన 2 నెలల్లో ముగ్గురు బీజేపీ నేతలది ఇదే మాట

లల్లూ సింగ్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): ఎన్డీయే కూటమికి మూడోసారి అధికారాన్ని కట్టబెడితే, రాజ్యాంగాన్ని మార్చేస్తారంటూ ప్రతిపక్ష పార్టీలకు చెందిన పలువురు నేతలు ఇటీవలి కాలంలో పెద్దయెత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే, తాము అదేం చేయబోమని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవలే చెప్పుకొచ్చారు. అంతేకాదు రాజ్యాంగాన్ని రాసిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ కూడా దాన్ని మార్చలేరని నొక్కిచెప్పారు. కానీ, మోదీ మాటలను కాదని ఆయన పార్టీకి చెందిన సీనియర్ నేతలే 'రాజ్యాంగ మార్పు' అంశాన్ని తరుచూ తెరమీదకు తీసుకొస్తున్నారు. ఎన్డీయే కూటమికి 2/3 మెజారిటీ ఇస్తే, తప్పకుండా రాజ్యాంగాన్ని తిరగరాస్తామంటూ పేర్కొంటున్నారు. ఇప్పుడు ఈ విషయం సర్వత్రా అందోళన కలిగిస్తున్నది.

ఇలా అయితేనే సాధ్యం

అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మిల్కీపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో అయోధ్య సిట్టింగ్ ఎంపీ, బీజేపీ నేత లల్లూసింగ్ పాల్గొని మాట్లాడారు. '272 ఎంపీ సీట్లతో ప్రభుత్వాన్నైతే ఏర్పాటు చేయవచ్చు. అయితే, ఈ మెజారిటీతో రాజ్యాంగ సవరణలు కష్టం. రాజ్యాంగాన్ని మార్చాలన్నా.. లేక, కొత్త రాజ్యాంగాన్ని తీసుకురావాలన్నా ఎన్డీయేకు 2/3 మెజారిటీ అవసరం' అని అన్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవ్వడంతో దిద్దుబాటు చర్యలకు దిగిన లల్లూసింగ్.. తప్పుడు ఉద్దేశంతో తాను ఆ వ్యాఖ్యలు చేయలేదంటూ చెప్పుకొచ్చారు.

రాజ్యాంగంలో మార్పులు జరగొచ్చు: అరుణ్ గోవిల్

రాజ్యాంగంలో మార్పులు జరుగొచ్చంటూ బీజేపీ నేత అరుణ్ గోవిల్ తాజాగా చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఎన్డీయే సర్కారు మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారంటూ విపక్షాలు చేస్తున్న విమర్శలపై మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన స్పందించారు. 'కాలానుగుణంగా రాజ్యాంగంలో మార్పులు జరిగాయి. మార్పు అనేది అభివృద్ధికి సంకేతం. ఇది ప్రతికూలాంశం కాదు. నాటికీ, నేటికీ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. రాజ్యాంగంలో మార్పులు జరగాలంటే ఒక వ్యక్తి అభిప్రాయంతో సాధ్యం కాదు. అందరి సమ్మతితో దాన్ని మార్చుకోవచ్చు' అని పేర్కొన్నారు.

గతంలో వీళ్లు ఇలా..

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయేకి 400కు పైగా సీట్లు ఇస్తే, హిందువులకు అనుకూలంగా రాజ్యాంగాన్ని మార్చేస్తామని గత నెలలో కర్వార్‌లో జరిగిన ఓ సభలో ఎంపీ అనంత్‌కుమార్ హెగ్డే అన్నారు. రాజ్యాంగ పీఠికలో 'లౌకిక వాదం' అనే పదాన్ని కూడా తొలగిస్తామన్నారు. 'హిందువులకు అనుకూలమైన రాజ్యాంగం రావాలంటే మోదీ నేతృత్వంలోని బీజేపీకి లోక్‌సభలో అధిక సీట్లు ఇవ్వాలి. బీజేపీకి లోక్‌సభ, రాజ్యసభలతో పాటు రాష్ట్రాల ప్రభుత్వాల్లో 2/3 వంతుల మెజార్టీ ఉండాలి' అని పేర్కొన్నారు. నాగ్‌పూర్ నుంచి పోటీచేస్తున్న బీజేపీ అభ్యర్థి జ్యోతి మిర్దా కూడా ఈ నెల తొలివారంలో రాజ్యాంగ మార్పునకు సంబంధించి ఇవే తరహా వ్యాఖ్యలు చేశారు. 'దేశ ప్రయోజనాల కోసం కొన్ని కఠినమైన నిర్ణయాలను తీసుకోవాల్సి ఉంటుంది. దీనికోసం రాజ్యాంగంలో సవరణలు, దాన్ని మార్చడం అవసరం. ఇది జరుగాలంటే ఉభయ సభల్లో బీజేపీకి 2/3 వంతుల మెజార్టీ కావాలి' అని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల వేళ బీజేపీ సీనియర్లు తరుచూ రాజ్యాంగ మార్పుపై వ్యాఖ్యలు చేస్తుండటం సామాన్యులతో పాటు బుద్ధిజీవులకు ఆందోళన కలిగిస్తున్నది.

'ఈశాన్యం' మొగ్గు ఎటు?

2019 ఎన్నికల్లో బీజేపీకి 14 లోక్‌సభ సీట్లు.. ఈసారి 22 స్థానాలు లక్ష్యం

అస్సాంలో డీలిమిటేషన్‌తో జరిగిన మార్పులపై ఆశలు

హింసతో అట్టుడుకిన మణిపూర్‌లో ఓటర్ల అనాసక్తి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: ఈశాన్య రాష్ట్రాలు భారత్‌లో ఎప్పటికీ ప్రత్యేకమే. పేరుకు ఎనిమిది రాష్ట్రాలు ఉన్నప్పటికీ.. లోక్‌సభలో ఉండే సీట్ల సంఖ్య కేవలం 25 మాత్రమే. ఒక్క అస్సాంలోనే 14 స్థానాలు ఉంటాయి. కాంగ్రెస్ కంచుకోటగా ఉండే ఈశాన్య రీజియన్‌లో.. గత దశాబ్ద కాలంలో బీజేపీ తన బలాన్ని పెంచుకొన్నది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 14 ఎంపీ స్థానాలు గెలుచుకోగా.. కాంగ్రెస్ కేవలం 4 సీట్లకే పరిమితమైంది. ప్రాంతీయ పార్టీలు ఏడు స్థానాల్లో విజయం సాధించాయి. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆయా రాష్ట్రాల్లోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులను పరిశీలిద్దాం..

అస్సాంలో డీలిమిటేషన్ పనిచేసేనా?

అస్సాంలో చేపట్టిన నియోజకవర్గాల పునర్విభజనతో లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల సంఖ్యలో మార్పు లేనప్పటికీ, నియోజకవర్గాల భౌగోళిక సరిహద్దుల్లో మార్పులు జరిగాయి. దీంతో ముస్లింలు అధికంగా ఉండే సీట్ల సంఖ్య గణనీయంగా తగ్గింది. డీమిటేషన్‌తో బార్పెట లోక్‌సభ నియోజకవర్గంలో 77 వేల ఓట్లు తగ్గాయి. దీంతో కాంగ్రెస్‌కు పట్టుండే ఈ స్థానంలో విజయంపై బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ఆశలు పెట్టుకొన్నది. బార్పెట స్థానంలో ఎన్డీయే కూటమిలోని అసోం గణపరిషత్(ఏజీపీ) అభ్యర్థి ఫాణి భూషణ్ చౌదరి పోటీచేస్తున్నారు.

మేఘాలయలో బీజేపీకి వెనుక సీటు

రాష్ట్రంలోని సీఎం కన్రాడ్ సంగ్మా నేతృత్వంలోని ప్రభుత్వంలో బీజేపీ జూనియర్ భాగస్వామిగా ఉన్నది. ఇక్కడ రెండు ఎంపీ స్థానాలైన షిల్లాంగ్, తురలో అధికార నేషనల్ పీపుల్స్ పార్టీకి(ఎన్‌పీపీ) కమలం పార్టీ మద్దతు ప్రకటించింది. ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోటగా ఉండే మేఘాలయలో.. ఇప్పుడు ఎన్‌పీపీ, యూడీపీ వంటి ప్రాంతీయ పార్టీలు ఆధిపత్యం ప్రదర్శిస్తున్నాయి.

త్రిపురలో 'మోత' వినిపించేనా?

'గ్రేటర్ తిప్రాల్యాండ్' ప్రత్యేక రాష్ట్రం డిమాండ్ చేస్తున్న ప్రద్యోత్ దేవర్మ నేతృత్వంలోని తిప్ర మోత పార్టీతో బీజేపీ జట్టు కట్టింది. రాష్ట్ర స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న భూమి, రాజకీయ హక్కులు, ఇతర సమస్యలను పరిష్కారానికి తిప్ర మోతతో గత నెల కేంద్రం ఒప్పందం చేసుకొన్నది. ఈస్టు త్రిపురలో ప్రద్యోత్ సోదరి కీర్తి సింగ్ పోటీచేస్తున్నారు. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 13 స్థానాలు గెలుచుకొన్న తిప్ర మోత పార్టీకి లోక్‌సభ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి.

అరుణాచల్‌లో బీజేపీ జోరు

ఈనెల 19న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలతోపాటుగా రాష్ట్రంలోని రెండు లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరుగనున్నది. అరుణాచల్‌లో నామినేషన్ల క్రమంలోనే 10 సీట్లను బీజేపీ ఏకగ్రీవంగా గెలుచుకోవడం ఆసక్తికర అంశం. ఇందులో సీఎం పెమా ఖండూ, డిప్యూటీ సీఎం చౌనా మీన్ ఉన్నారు. ఇదే ఊపుతో రెండు లోక్‌సభ స్థానాలను కూడా గెలుచుకొంటామని పెమాఖండూ ఆశాభావం వ్యక్తం చేశారు.

నాగాలాండ్, మిజోరంలో ఏం జరిగేను?

ఈ రెండు రాష్ట్రాల్లో ఒక్కో లోక్‌సభ స్థానం చొప్పున ఉన్నాయి. స్వయం ప్రతిపత్తి ప్రాదేశిక మండలి ఏర్పాటులో జరుగుతున్న జాప్యంపై నాగాలాండ్ తూర్పు రీజియన్‌లో ఆందోళనలు జరుగుతున్నాయి. ఆరు తూర్పు జిల్లాల్లో ప్రచారానికి దూరంగా ఉండాలని పార్టీలకు సూచిస్తూ ఈస్టర్న్ నాగాలాండ్ పీపుల్స్ ఆర్గనైజేషన్(ఈఎన్‌పీవో) ఎన్నికల బహిష్కరణ పిలుపునిచ్చింది. మిజోరం లోక్‌సభ నియోజకవర్గంలో బహుముఖ పోటీ నెలకొన్నది. అధికార జోరం పీపుల్స్ మూవ్‌మెంట్(జడ్‌పీఎం) పార్టీ తొలిసారి లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేస్తున్నది.

సిక్కింలో ఎదగాలనుకొంటున్న కమలం

ఈనెల 19న సిక్కిం అసెంబ్లీకి, రాష్ట్రంలోని ఒక్క లోక్‌సభ స్థానానికి ఎన్నికలు జరుగనున్నాయి. జాతీయ అంశాలు, మోదీ ప్రభుత్వ పథకాలతో ఈ హిమాలయ రాష్ట్రంలో బలపడాలని బీజేపీ ఉవ్విళ్లూరుతున్నది. సీఎం ప్రేమ్ సింగ్ తమాంగ్ నేతృత్వంలోని అధికార సిక్కిం క్రాంతికారి మోర్చా(ఎస్‌కేఎం)తో సీట్ల పంపిణీ చర్చలు విఫలమైన తర్వాత రాష్ట్రంలో ఒంటరిగా పోటీచేయాలని బీజేపీ నిర్ణయించింది. రాష్ట్రంలో రాజకీయ లక్ష్యంతో బీజేపీ కొత్త ఫైనాన్స్ చట్టం-2023లో 'సిక్కిమీస్' నిర్వచనాన్ని విస్తరించింది. స్థానిక లేప్చా, భూటియా, నేపాలీలను దాటి 1975 వరకు పాత స్థిరనివాసుల వారసులను ఇందులో చేర్చింది.

హింస నీడలో మణిపూర్

మైతీ, కుకీ వర్గాల మధ్య ఘర్షణ, అశాంతి పరిస్థితుల నేపథ్యంలో మణిపూర్‌లోని రెండు లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో ఎన్నికల ఉత్సాహం కనిపించడం లేదు. ఇంఫాల్ లోయలో బహిరంగ సభలు నిర్వహించొద్దని రాడికల్ మైతీ గ్రూపు రాజకీయ పార్టీలకు సూచించగా.. మరోవైపు ఎన్నికలను బహిష్కరించాలని పర్వత ప్రాంతాల్లోని ప్రజలకు కుకీ సంఘాలు పిలుపునిచ్చాయి. కుకీ-జోమి వర్గం నుంచి ఎవరూ లోక్‌సభ ఎన్నికల్లో బరిలో లేకపోవడం ఇదే తొలిసారి. ఈ కమ్యూనిటీలకు ఔటర్ మణిపూర్ నియోజకవర్గంలో 3 లక్షల ఓటు బ్యాంక్ ఉన్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని రెండు స్థానాలను నిలబెట్టుకోవాలని బీజేపీ, మిత్రపక్షం నాగా పీపుల్స్ ఫ్రంట్(ఎన్‌పీఎఫ్) కన్నేశాయి.

సెల్ఫీ తీసుకున్నా పన్ను వేస్తారేమో

జీఎస్టీతో పేదలను దోపిడీ చేస్తున్నారు: స్టాలిన్

చెన్నై: వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) పేదలను దోచుకునే విధంగా ఉందని తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే చీఫ్ ఎంకే స్టాలిన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇకపై సెల్ఫీ తీసుకోవటాన్ని కూడా జీఎస్టీ పరిధిలోకి తీసుకొస్తారా? అని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన సోమవారం ట్వీట్ చేశారు. హోటళ్ల దగ్గర నుంచి ద్విచక్ర వాహనాల మరమ్మతుల వరకు ప్రతిదానిపైనా పన్ను వసూలు చేస్తుండటం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రెస్టారెంట్ల ఫుడ్ బిల్లుల్లో జీఎస్టీ చూసి మధ్యతరగతి ప్రజలు హడలిపోతున్నారని, ఆ గబ్బర్‌సింగ్ ట్యాక్స్‌పై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారని చెప్పారు. 'తర్వాత ఏంటి? సెల్ఫీ తీసుకున్నా జీఎస్టీ విధిస్తారా?' అని నిలదీశారు. రూ.1.45 లక్షల కోట్ల కార్పొరేట్ ట్యాక్స్‌ను మాఫీచేసిన కేంద్రంలోని బీజేపీ సర్కారు.. పేదలపై మాత్రం కరుణ చూపదా? అని ప్రశ్నించారు. జీఎస్టీ వసూళ్లలో 64 శాతం వాటా పేదల ముక్కుపిండి వసూలు చేసినదేనని పేర్కొన్నారు. మధ్యతరగతి ప్రజల నుంచి 33 శాతం వసూలు చేశారని, సంపన్నుల వాటా కేవలం 1 శాతమేనని ఆక్రోశం వ్యక్తంచేశారు.

అదే జరిగితే ఈసీ ఆఫీసు ఎదుట నిరాహార దీక్ష చేస్తా

బెంగాల్ సీఎం మమత హెచ్చరిక

కూచ్‌బెహార్/అలీపురుదౌర్, ఏప్రిల్ 15: బీజేపీ ఆదేశాలతోనే ఎన్నికల సంఘం పనిచేస్తున్నదని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. రాష్ట్రంలో ఒక్క అల్లర్ల ఘటన జరిగినా ఈసీ కార్యాలయం బయట నిరాహారదీక్ష చేస్తానని హెచ్చరించారు. అలీపూర్‌దౌర్‌లో నిర్వహించిన ర్యాలీలో ఆమె మాట్లాడుతూ బీజేపీ కోరిక మేరకే ముర్షీదాబాద్ డీఐజీని ఎన్నికల సంఘం తొలగించిందని ఆరోపించారు. ముర్షీదాబాద్, మాల్దాలో కనుక అల్లర్లు జరిగితే అందుకు ఎన్నికల సంఘమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అల్లర్లు, హింసను ప్రేరేపించేందుకు పోలీసుల అధికారులను మార్చాలని బీజేపీ కోరుకుంటున్నదని, ఇక్కడ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నందున ఒక్క ఘటన జరిగినా అందుకు ఈసీ బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అవసరం అనుకుంటే ఈసీ కార్యాలయం బయట 55 రోజులపాటు నిరాహారదీక్ష చేస్తానని మమత హెచ్చరించారు. గతంలో సింగూరు రైతుల కోసం 26 రోజులు నిరాహారదీక్ష చేశానని, ఇప్పుడు 55 రోజులు చేయగలనని పేర్కొన్నారు.

45 రోజుల్లో రూ.4,650 కోట్లు సీజ్

రోజుకు 100 కోట్లు స్వాధీనం • కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా తరలిస్తున్న నగదు, మద్యం భారీగా పట్టుపడుతున్నాయి. మార్చి 1 నుంచి ఈ నెల 15 వరకు దేశవ్యాప్తంగా 45 రోజుల వ్యవధిలో రూ.4,650 కోట్ల విలువైన డబ్బు, మద్యం, ఇతర తాయిలాలు, మాదకద్రవ్యాలను సీజ్ చేసినట్టు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం వెల్లడించింది. ఇందులో ఏకంగా రూ.2,069 కోట్ల విలువైన డ్రగ్స్ ఉన్నాయని, ఇది మొత్తంలో 45 శాతమని ఈసీ తెలిపింది. 2019 ఎన్నికలతో (రూ.3,475 కోట్లు) పోలిస్తే ఈసారి పట్టుబడింది చాలా ఎక్కువని పేర్కొన్నది. గత నెల 1 నుంచి దేశవ్యాప్తంగా జరిపిన సోదాల్లో భాగంగా రోజుకు సగటున రూ.100 కోట్లు విలువైన వాటిని స్వాధీనం చేసుకొన్నామని ఈసీ వెల్లడించింది. మొత్తం సీజ్ చేసిన రూ.4,658 కోట్ల విలువైన వాటిలో నగదు రూ.395 కోట్లు, మద్యం వాటా రూ.489 కోట్లకు పైగా ఉంటుందని పేర్కొన్నది. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో సీజ్ చేసిన మొత్తంలో 75 శాతం మాదకద్రవ్యాలే ఉన్నాయని ఎన్నికల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా ప్రచారంలో రాజకీయ నేతలకు సహకరిస్తున్న 106 మంది ప్రభుత్వ అధికారులపై కఠిన చర్యలు తీసుకొన్నట్టు ఈసీ ఈ సందర్భంగా పేర్కొన్నది. కాగా, హెలికాప్టర్లో సోదాలు చేయడం కొత్తేం కాదని, టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ విషయంలో కూడా అదే జరిగిందని ఈడీ వర్గాలు పేర్కొన్నాయి.

తమిళనాడులో 900 కోట్ల బంగారం పట్టివేత

తమిళనాడులో 1,425 కిలోల బంగారం కడ్డీలను ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు సీజ్ చేశారు. శనివారం శ్రీపెరంబుదూర్ నియోజకవర్గంలో వండలూర్‌కు సమీపంలో ఓ వ్యాన్‌ను అడ్డుకొని తనిఖీలు జరపగా భారీ మొత్తంలో బంగారం కడ్డీలు పట్టుబడ్డాయి. వీటి విలువ సుమారుగా రూ.900 కోట్లకుపైగా ఉంటుందని, 400 కిలోల బంగారానికి మాత్రమే రశీదులు, కస్టమ్స్ పత్రాలు ఉన్నాయని అధికారులు చెప్పారు. 'వ్యాన్ వెంట సాయుధులైన భద్రతా సిబ్బంది ఉన్నారు. తాము ఓ నగదు మేనేజ్‌మెంట్ కంపెనీకి చెందిన వారిమని వాహనాల్లోని వ్యక్తులు చెప్పారు' అని ఎన్నికల అధికారులు వెల్లడించారు. 1,025 కిలోల బంగారానికి లెక్కాపత్రం లేదని, దీనిపై దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

న్యాయ వ్యవస్థను కాపాడుకోవాలి

సీజేఐకి రిటైర్డ్ జడ్జీల లేఖ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: దేశంలో న్యాయ వ్యవస్థకు గడ్డు కాలం దాపురించిందని సుప్రీంకోర్టుతోపాటు వివిధ హైకోర్టులకు చెందిన 21 మంది రిటైర్డ్ న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. తప్పుడు సమాచారం, ప్రణాళికాబద్ధమైన ఒత్తిడులు, బహిరంగంగా అవమానించడం ద్వారా న్యాయ వ్యవస్థను అణగదొక్కేందుకు కొన్ని వర్గాలు ప్రయత్నిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నానాటికీ పెరుగుతున్న ఇలాంటి ప్రయత్నాల నుంచి న్యాయ వ్యవస్థను కాపాడుకోవాల్సిన అవసరమున్నదంటూ సీజేఐకి లేఖ రాశారు. వ్యక్తిగత, సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు విపరీత చర్యలకు పాల్పడుతున్నారని, దీని వల్ల న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. అధికార, విపక్ష నాయకుల మధ్య కొనసాగుతున్న మాటల యుద్ధం, ప్రతిపక్ష నేతలపై అవినీతి కేసులు, బాధిత నాయకులకు న్యాయస్థానాల్లో ఎలాంటి ఉపశమనం లభించకపోవడం తదితర అంశాలను ఆ లేఖలో ప్రస్తావించారు. ఒత్తిడులకు లొంగకుండా న్యాయ వ్యవస్థ స్వయం ప్రతిపత్తిని కాపాడాలని సీజేఐను కోరారు.

బీజేపీకి మద్దతిచ్చి భంగపడ్డాం

- 750 మంది రైతుల బలిదానాన్ని ఆ పార్టీ గుర్తించలేదు
- ఈ ఎన్నికల్లో మద్దతుపై చర్చిస్తాం
- రేపటి మహా పంచాయత్‌లో ఉమ్మడి నిర్ణయం వెల్లడి
- పీటీఐ ఇంటర్వ్యూలో బీకేయూ నేత నరేశ్ టికాయిత్

నరేశ్ టికాయిత్

ముజఫర్‌నగర్, ఏప్రిల్ 15: పదేండ్ల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపికి మద్దతు ఇచ్చి భంగపడ్డామని బీకేయూ నేత నరేశ్ టికాయిత్ విచారం వ్యక్తం చేశారు. నాలుగేండ్ల క్రి తం ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు చేసిన ఉద్యమం లో 750 మంది కర్షకుల బలిదానాన్ని బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గుర్తించలేద ని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ సర్కారుది నియంతృత్వ ధోరణి అని మండిపడ్డారు. యూపీలోని సిసౌలీలో సోమవారం ఆయన పీటీఐ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దుతు ఇవ్వాలన్న దానిపై ఈ నెల 17న యూపీలోని సిసౌలీలో నిర్వహించే మహా పంచాయత్‌లో నిర్ణయం తీసుకుంటామన్నారు. 'మాది పెద్ద సంఘం. ప్రతి సభ్యుడు ఏదో ఒక పార్టీతో సంబంధం కలిగి ఉంటారు. కొందరు ఎన్నికల అభ్యర్థులతో బంధుత్వం కలిగి ఉంటారు లేదా వ్యక్తిగత స్థాయిలో సంబంధాలు కలిగి ఉంటారు. కాబట్టి ఉమ్మడిగా ఎవరికి మద్దతు ఇవ్వాలనే విషయంలో మేం నిర్ణయం తీసుకోలేకపోయాం' అని టికాయిత్ అన్నారు. బీజేపీకి ఆర్ఎల్డీ మద్దతు ఇవ్వడం తమను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. అయితే ఆర్ఎల్డీని తమ సంఘం వ్యతిరేకించదని..ఆ మాటకొస్తే తాము ఎవరినీ వ్యతిరేకించమని చెప్పారు.

బీజేపీ మ్యానిఫెస్టో రైతు వ్యతిరేకం

బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టో దేశ రైతాంగానికి, రైతు కూలీలకు వ్యతిరేకమని, పంటలకు కనీస మద్దతు ధర అమలు ప్రస్తావనే ఆ పార్టీ ఎన్నికల హామీలో లేదని 'సంయుక్త కిసాన్ మోర్చా' (ఎస్కేఎం) ఆగ్రహం వ్యక్తం చేసింది. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రస్తావన లేని బీజేపీ మ్యానిఫెస్టో.. రైతులు, రైతు కూలీలకు వ్యతిరేకంగా విసిరిన బహిరంగ సవాల్‌గా ఎస్కేఎం అభిప్రాయపడింది.

నీటి కొరతతో 300 బత్తాయి చెట్ల నరికివేత

మహారాష్ట్రలో ఘటన

ఛత్రపతి శంభాజీనగర్: మురిపెంగా పెంచుకుంటున్న 300 బత్తాయి చెట్లను స్వయంగా ఆ రైతే చేతులారా నరికేసిన సంఘటన మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో చోటు చేసుకున్నది. నీటి ఎద్దడి వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్టు రైతు ఆవేదనగా చెప్పారు. ముర్మా గ్రామ రైతు రాజేంద్ర తన పొలంలో 11 ఏండ్ల క్రితం నాటిన బతాయి చెట్లను నరికేశారు. తనకు మరో మార్గం లేదని, తన రెండు బావులు గత రెండు నెలలుగా పూర్తిగా ఎండిపోయాయన్నారు.

ఇరాన్‌పై ప్రతిదాడులకు దిగొద్దు

జెరూసలేం : ఇరాన్‌పై ప్రతిదాడులకు దిగొద్దని ఇజ్రాయెల్‌ను ప్రపంచ దేశాల నేతలు కోరారు. ఉద్రిక్తతలను మరింత పెంచకుండా ఉండేందుకు ఇజ్రాయెల్‌తో మాట్లాడేందుకు ప్రయత్నిస్తామని ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ పేర్కొన్నారు. ఇజ్రాయెల్ ప్రతిదాడులకు తాము మద్దతిచ్చే ప్రసక్తే లేదని యూకే విదేశాంగ శాఖ మంత్రి కామరూన్ స్పష్టం చేశారు.

ఈసారి సమృద్ధిగా వానలు

రుతుపవన సీజన్‌లో సాధారణం కంటే అధిక వర్షపాతం: ఐఎండీ

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): ఓ వైపు ఎండలు మాడు పగులకొడుతున్న వేళ భారత వాతావరణ శాఖ రైతులకు, ప్రజలకు చల్లటి కబురు అందించింది. దేశంలో ఈసారి రుతుపవన సీజన్‌లో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ అంచనా వేసింది. ఆగస్టు-సెప్టెంబరు నాటికి ఎక్కువ వర్షపాతం నమోదు కావచ్చని వెల్లడించింది. దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. తెలంగాణలో కూడా ఈ ఏడాది సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదవుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రావణి తెలిపారు.

లానినాతో మంచి వర్షాలు

జూన్ నాటికి ఎల్‌నినో బలహీనపడనున్నదని భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర పేర్కొన్నారు. మేనాటికి ఎల్‌నినో మరింత బలహీనపడి, జూన్ నాటికి పూర్తిగా తగ్గి తటస్థ పరిస్థితులు ఏర్పడతాయని పేర్కొన్నారు. ఆ తర్వాత జూలై నెలాఖరు నాటికి లానినా పరిస్థితులు ఏర్పడనున్నందున మంచి వర్షాలు కురుస్తాయని వెల్లడించారు. ఇండియన్ ఓషన్ డైపోల్ పరిస్థితులు, ఉత్తరార్ధ గోళంలో తగ్గిన మంచు విస్తృతి ఈసారి నైరుతి రుతుపవనాలకు అనుకూలంగా ఉన్నాయని వివరించారు. ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ కూడా రుతుపవనాల సీజన్ వర్షాలపై ఇటీవల ఇలాంటి అంచనాలనే వెల్లడించింది.

అమర్‌నాథ్ యాత్ర రిజిస్ట్రేషన్లు ప్రారంభం

జూన్ 29 నుంచి యాత్ర మొదలు

అమర్‌నాథ్: జమ్ముకశ్మీరులోని అమరలింగేశ్వరుని దర్శించుకోవాలనుకునే భక్తులకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. పంజాబ్ నేషనల్ బ్యాంకుకు చెందిన 540 శాఖలు ఈ ప్రక్రియను ప్రారంభించాయి. అమర్‌నాథ్ యాత్ర జూన్ 29నుంచి ఆగస్టు 19 వరకు 52 రోజుల పాటు జరుగుతుంది. సముద్ర మట్టం నుంచి 3,880 మీటర్ల ఎత్తులోని మంచు కొండల్లో అమరలింగేశ్వరుడు కొలువై ఉన్న సంగతి తెలిసిందే. అమరనాథ్ దేవస్థానం బోర్డు ఈ యాత్రకు ఏర్పాట్లు చేస్తుంది. దక్షిణ కశ్మీరులోని అనంత్‌నాగ్‌లో ఉన్న పహల్గామ్ మీదుగా 48 కిలోమీటర్లు ప్రయాణించి అమర్‌నాథ్‌కు చేరుకోవచ్చు. మధ్య కశ్మీరులోని గండేర్‌బల్ జిల్లాలో ఉన్న గండేర్‌బల్ మార్గంలో 14 కి.మీ. ప్రయాణించి కూడా అమరలింగేశ్వరుని దర్శించుకోవచ్చు.

గ్రీన్‌కార్డ్ కోసం దశాబ్దాలుగా నిరీక్షణ

12 లక్షల మందికిపైగా భారతీయుల ఎదురుచూపులు

వాషింగ్టన్: అమెరికాలో శాశ్వత నివాస హక్కును కల్పించే 'గ్రీన్ కార్డు' కోసం అక్కడి భారతీయ వృత్తి నిపుణులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నారు. గ్రీన్ కార్డ్ బ్యాక్‌లాగ్స్‌లో భారతీయుల సంఖ్య 2023 నవంబర్ 2 నాటికి 12,59,443కు చేరుకున్నది. అమెరికా పౌరసత్వం, వలస సేవల విభాగం (యూఎస్‌సీఐఎస్) డాటాను విశ్లేషించిన నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ (ఎన్ఎఫ్ఏపీ) తాజా గణాంకాల్ని విడుదల చేసింది. డాక్టర్లుగా, సైంటిస్టులుగా, కాలేజీ ప్రొఫెసర్లుగా, మల్టీనేషనల్ కంపెనీ సీఈవోలుగా.. ఉన్నత స్థానాల్లో ఉన్నవారు సైతం గ్రీన్ కార్డు పొందలేక అవస్థపడుతున్నారు. ఇది.. వ్యక్తిగతంగా వారిపై, వారి కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. చైనా, ఫిలిప్పైన్స్ దేశాలతో పోల్చితే గ్రీన్ కార్డ్ పొందటంలో భారతీయుల వెయిటింగ్ టైమ్ చాలా ఎక్కువగా ఉంది. గ్రీన్ కార్డ్ బ్యాక్‌లాగ్స్‌లో 1,48,000 మంది చైనావాళ్లు ఉన్నారని నివేదిక తెలిపింది. దీనికి కారణం అమెరికా వలస విధానమని నివేదిక అభి